ప్లేస్‌మెంట్ లీడర్‌ఫిప్ అవార్డ్స్ ప్రదానం

మార్కెట్‌లో ప్రతిభను బట్టి ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ప్లేస్‌మెంట్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీముద్దీన్ అన్నారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ లీడర్స్ అసోసియేషన్ సమ్మిట్-2025ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న టీపీఓలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష ప్రతిభ కనబర్చిన టీపీఓలను ప్లేస్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డ్స్-2025తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెట్ మ్యాక్స్, ఐరిస్ ఉపాధ్యక్షుడు వి.సంయుక్త, మురళీప్రసాద్, కోశాధికారి చైతన్య, సలహాదారుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జనవరి 10

హారన్ మోగించరాదు

వాహనదారులు రోడ్లపై శబ్ద కాలుష్యం చేయవద్దని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం నానల్‌నగర్ చౌరస్తా వద్ద లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు హాస్పిటల్స్, స్కూల్స్ వద్ద హారన్ మోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 10

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి

ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో కటాస్ విభాగంలో జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పథకాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గెలుపొందిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, కరీం, అమృతరెడ్డి, ఘన సంతోషిణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జనవరి 10

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



న్యూ రామాలయంలో విగ్రహాలను ఊరేగిస్తున్న పండితులు, భక్తులు తదితరులు

అంబర్‌పేట/ గోల్నాక, జనవరి 10: ఏకాగ్రతతో భగవంతున్ని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం చే నంబర్‌లోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయం, న్యూ రామాలయం, అహోబిలం మఠం ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రావి కమలాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, సత్యనారాయణ, యాదగిరిగౌడ్, నూనెముంతల అంజయ్యగౌడ్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



మెహిదీపట్నం : ఇబ్రహీంబాగ్‌లోని హనుమాన్ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంలో పాల్గొన్న బస్తీ నాయకులు వినాయక దయానంద్, రాకేశ్ పటేల్

మెహిదీపట్నం: ఆసిఫ్‌నగర్‌లో జరిగిన ఏకాదశిపూజలలో పాల్గొన్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నబత్ని లక్ష్మీనారాయణ

శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తలసాని పూజలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జియాగూడ శ్రీరంగనాథస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించిన మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్, గౌలిగూడ కార్పొరేటర్ శంకర్‌యాదవ్

కార్వాన్, జనవరి 10 : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జియాగూడ శ్రీరంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారు జామునుంచే శ్రీలక్ష్మి, భూదేవి సమేత వైకుంఠ నాథుడి సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ తిరువెంగళాచార్యులు, అర్చకులు శ్రీనివాస రంగనాథా చార్యుల బృందం భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ మొదలైంది. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్‌లతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై పుర వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గౌలిగూడ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, యాద శ్రీనివాస్ గుప్తా, కావురి వేంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు సి. బాబు, నర్మద, అనితా తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి జోష్ణారాణి

కాచిగూడ, జనవరి 10: విద్యార్థుల పరీక్ష సమయంలో ఒత్తిడి లేకుండా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు బాధ్యతగా కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు సంయుక్త కార్యదర్శి డాక్టర్ జోష్ణారాణి అన్నారు. శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బంగారు భవిష్యత్‌కు విద్య ప్రధాన ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, శ్రీనివాస్‌రావు, గీతాబాయి, వి.ప్రసాద్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య, బాలమణి, రామ్మోహన్, రజిని, మేఘమాల పాల్గొన్నారు.

విద్యతోనే సంపూర్ణ పరిజ్ఞానం

మాట్లాడుతున్న విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, శశికాంత్, సుదర్శన్‌రెడ్డి, అచ్యుతాదేవి, ముత్యంరెడ్డి తదితరులు

కాచిగూడ, జనవరి 10 : విద్య అనేది కేవలం ఉద్యోగాలకే పరిమితం కాదని, సంపూర్ణ పరిజ్ఞానం సాధించి, సమాజ అవసరాల కోసం ఉపయోగించేదే నిజమైన విద్య అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. నారాయణగూడలోని రెడ్డి మహిళా కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శశికాంత్, రెడ్డి కళాశాల సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అచ్యుతాదేవి, ముత్యంరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిటెక్టివ్ నవలలు పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జనవరి10 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత ఏవీ మోహన్రావ్ రచించిన డిటెక్టివ్ నవలలు పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం, రాజారామ మోహనరావు,సీహెచ్ శివప్రసాద్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాళి రఘురామ్, డా.ఆర్. ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన నాలాను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి

కూలిన గోషామహల్ నాలాను పరిశీలిస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురేశ్ ముదిరాజ్, బి. రమేశ్‌గుప్తా

అబిడ్స్, జనవరి 10: గోషామహల్ ప్రాంతంలో నాలా మరోసారి కూలి రెడీ మిక్స్ వాహనం పడి పోవడంతో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురేశ్ ముదిరాజ్, బి. రమేష్‌గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో నాలాపై కప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాల రాక పోకలు సాగినప్పుడల్లా కూలి పోతోందని వాపోయారు. నాలా పనులు చేపట్టినప్పుడల్లా నాసి రకంగా నాలా నిర్మించడం వల్లే ఇప్పటికే పలు మార్లు కూలి పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రజా ధనం వృథా అవుతున్నదని అన్నారు. ఇంకా ఎన్నిసార్లు నిర్మిస్తారని, ఇప్పటికైనా అధికారులు మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని అన్నారు. భారీ ఎత్తున వాహనాల రాక పోకలు సాగుతుండడంతో నాలాపై కప్పును పటిష్టంగా నిర్మించాలని అన్నారు. మాటిమాటికి నాలా పై కప్పు కూలి పోకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

కాచిగూడ,జనవరి 10 : రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60)శుక్రవారం ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గోధుమ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి.ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 99486 95948లో సంప్రదించాలని కోరారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ..

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ముంగి రఘుపాల్ రెడ్డిని శుక్రవారం కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ, బీ బ్లాక్‌ల అధ్యక్షుడు కూరాకుల కృష్ణ, కె.చంటిబాబు సన్మానించారు.

– మెహిదీపట్నం, జనవరి 10

ఆరంభ్-2కే 25 ముగింపు వేడుకలు

కాచిగూడ, జనవరి 10 : బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో ఆరంభ్-2కే 25 ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవంతి విద్యాసంస్థల చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. కె.చంద్రశేఖర్, నాగరాజు, అవంతి విద్యాసంస్థల అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యక్షుడు సందీశ్ పాల్గొన్నారు.

డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో పొంగల్ సంబురాలు

పొంగల్ సంబురాలలో డైమండ్ జూబ్లీ హైస్కూల్ విద్యార్థులు

అబిడ్స్, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిరాగ్‌అలి లేన్‌లోని డైమండ్ జూబ్లీ హై స్కూల్‌లో పొంగల్ సంబురాలను నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి కీర్తనలను పాడటంతో పాటు సంక్రాంతి పండుగ సందర్భంగా పొంగల్ సంబురాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత గడే మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలు, సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని రకాల పండుగలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పొంగల్ సంబరాలలో విద్యార్థులు ఎంతో సంతోషంగా గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్కొండలో ఎమ్మెల్యే పర్యటన

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలో శుక్రవారం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ స్థానికులతో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం అభివృద్ధి పనులను చేపడుతామని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, జనవరి 10

హత్య కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు

హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

కార్వాన్, జనవరి 10: గుడి మల్కాపూర్‌లోని భోజగుట్టలో ఈనెల 8వ తేదీన జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్య కేసు వివరాలను కుల్సుంపురా ఏసీపీ మహ్మద్ మునావర్, ఇన్‌స్పెక్టర్ భైరి రాజుతో కలిసి వెల్లడించారు. లేబర్‌గా పని చేసే అరుణ్(35) అనే వ్యక్తి రెండు నెలల కిందట భోజగుట్టలోని వివేకానందనగర్‌లో నివసిస్తున్నాడు. అయితే ఈనెల 8న అరుణ్ హత్యకు గురయ్యాడు. మృతుడి భార్య గార్ల విశ్వనాథ అలియాస్ సునీతతో అరుణ్‌కు 2014లో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. భార్య, భర్తలిద్దరూ సీసీ రోడ్డు నిర్మాణ కార్మికులుగా పని చేస్తుంటారు. అయితే సునీత పెండ్లికి ముందు అనుముల భాస్కర్(30) అనే వ్యక్తితో పెండ్లి చూపులు జరిగినప్పటికీ సునీత పుట్టింటి వారు భాస్కర్‌ను కాదని అరుణ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. దీంతో భాస్కర్ కక్ష పెంచుకున్నాడు. ఈనెల 6వ తేదీన తనకు దూరపు బంధువు అయిన అరుణ్‌ను పథకం ప్రకారం.. స్నేహితుడు షేక్ ఇస్మాయిల్‌తో కలిసి మద్యం తాగుదామని పిలిచి అనుముల భాస్కర్, షేక్ ఇస్మాయిల్‌లు అరుణ్‌కు బాగా మద్యం తాగించారు. మత్తులోకి జారుకోగానే తెచ్చుకున్న నైలాన్ తాడుతో గొంతుకు బిగించి అరుణ్‌ను హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకువచ్చి వివేకానందనగర్‌లోని శివాలయం వద్ద పడేసి వెళ్లిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విశ్వసనీయ సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. అరుణ్‌ను హత్య చేసింది తామేనని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఆటో, రెండు ఫోన్లు, హత్యకు ఉపయోగించిన నైలాన్ తాడును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ రాజుతోపాటు ఎస్ఐలు చంద్రశేఖర్, సయ్యద్ సాదుద్దీన్‌లను ఏసీపీ అభినందించారు.

బస్తీ దవాఖానల సమస్యలు పరిష్కరించాలి

కాచిగూడ, జనవరి 10: నింబోలిఅడ్డామౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దవాఖానలో రెండు నెలలుగా మెడికల్ అఫీసర్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. శుక్రవారం మౌలానా ఆజాద్‌నగర్‌లోని బస్తీ దవాఖానను ఆమె సందర్శించారు. దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేయడంతో రెండు నెలల తరువాత మెడికల్ అఫీసర్ విదుల్లో చేరడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, కృష్ణకుమార్, భీంరాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, మల్లి కార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమాయాదవ్ తదితరులు

సత్కారం

షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగం రవీందర్‌ను బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు కలిసి సత్కరించారు. ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించిన వారిలో సేన నాయకులు శివకుమార్, సునీల్ కుమార్ అగర్వాల్ తదితరులు ఉన్నారు.

– అబిడ్స్, జనవరి 10

ఇడ్లీ గల్లిలో మంచినీటి సమస్యకు పరిష్కారం

ఇడ్లీ గల్లిలో మంచినీటి సమస్యను పరిష్కరించిన జలమండలి అధికారులకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇడ్లీ గల్లిలో మంచినీటి సమస్యను స్థానికులు ఆనంద్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన జలమండలి జనరల్ మేనేజర్‌లను కలిసి మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరగా అధికారులు సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు ఆనంద్‌కుమార్ గౌడ్‌కు మిఠాయిలు తినిపించారు.

– అబిడ్స్, జనవరి 10

వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 10 : స్వామీ వివేకానంద ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జి సురేశ్ అన్నారు. స్వామీజీ జయంతి సందర్భంగా నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికే స్వామి ప్రసంగాలు ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో పయనించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వామీజీ జన్మదినాన్ని యువత దినోత్సవంగా జరుపుకోవడం పట్ల ఆనందంగా ఉందని కొనియాడారు. సీబీఐ జడ్జి రఘురామ్, మెజిస్ట్రేట్ అరుణకుమారి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సంయుక్త కార్యదర్శి మామిడాల రమేశ్, ఉపాధ్యక్షుడు గోకుల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు విజేతకు సన్మానం ..

ఆంగ్ల అక్షరాలను తిరగేసి జెడ్ నుంచి ఏ వరకు కేవలం 2.88సెకన్లలో టైపింగ్ చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించిన యువ న్యాయవాది ఎస్కే అష్‌రఫ్‌ను జడ్జీలు, బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. స్వామీజీ జన్మదినాన్ని పురస్కరించుకుని సన్మానించడం తనకు గర్వకారణమని న్యాయవాది అష్‌రఫ్ అన్నారు.

ముగ్గుల పోటీలు

అబిడ్స్, జనవరి 10 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా విద్యార్థినులు ముగ్గులు వేశారని నాంపల్లి కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చట్టా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లె వాతావరణం తలపించేలా విద్యార్థినులు చక్కని ముగ్గులు వేశారన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులను ప్రదానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హేమ, మంజుల, సునీత, జ్యోతి, ప్రియా, కవిత, సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టెలమండిలోని ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు